
నమస్తే తెలంగాణ

పెద్దపల్లి

5 | కరీంనగర్, మంగళవారం 7 జనవరి 2025 | PEDDAPALLI

# పచ్చి అబద్ధాలు.. అసత్యపు ఆరోపణలు!



- కాంగ్రెస్ నాయకులది అంతా బొబ్బే!
- కేటీఆర్ సంధించిన ప్రశ్నలకు సమాధానం కరువే
- విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు
- ఆగమేఘాల మీద స్పందించిన ఆది శ్రీనివాస్
- అనేక విషయాలపై దాటవేతే! • రాజన్న కోడెలపై మౌనమే • అసైన్డ్ భూముల వ్యవహారంలో కొంత మంది నాయకుల వసూళ్ల పర్వం?
- నేతల తీరుపై సర్వత్రా విమర్శలు

**రాజన్న కోడెల కోతపై నోరు విప్పలేదు..**

**సీఎం టూర్‌లో ప్లేట్ మీల్స్ ₹32 వేలపై సమాధానం లేదు..**

**ముంపు గ్రామాల్లో నేతలే దరఖాస్తులు తీసుకున్నా వివరణ లేదు..**

**నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇచ్చే డబ్బులపై స్పష్టత లేదు**

**మిగిలిన 5,987 మందిపై పట్టింపు లేదు..**

**వేములవాడ అభివృద్ధి నిధుల క్లారిటీ లేదు.. రుణమాఫీ ముచ్చట లేదు..**

**రైతు భరోసా ₹15 వేలని చెప్పి ₹12 వేలకు ఎందుకు తగ్గించారో చెప్పలేదు..**

..కానీ, 'పచ్చి అబద్ధాలు.. అసత్యపు ఆరోపణలు' చేయడంలో మాత్రం కాంగ్రెస్ నాయకులు తమకు తామే సాటి అని మరోసారి నిరూపించుకున్నారు! ఆదివారం సిరిసిల్ల జిల్లాకేంద్రంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిర్వహించిన విలేకరుల సమావేశమే అందుకు నిదర్శనమన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నెల 4న సిరిసిల్ల వేదికగా కాంగ్రెస్ చేసిన మోసాలను కేటీఆర్ తూర్పార పడితే ఆగమేఘాల మీద స్పందించిన ఆది శ్రీనివాస్.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంధించిన ఏ ఒక్క ప్రశ్నకూ సూటిగా సమాధానం ఇవ్వలేకపోయారు. పైగా విషయాన్ని పక్కదారి పట్టించేందుకు.. బీఆర్ఎస్ నాయకులు భూములు ఆక్రమించుకున్నారంటూ కొత్త ప్రచారాన్ని తెరపైకి తెచ్చారు. ఇటీవలి కాలంలో చర్చనీయాంశమైన అనేక విషయాలపై క్లారిటీ ఇవ్వకుండా, ఎంతసేపూ ఆరోపణలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల్లో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బురద చల్లే ప్రయత్నం చేసి, వారికి వారే సెల్ఫ్ గోల్ చేసుకున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇదిలా ఉంటే అసైన్డ్‌భూముల వ్యవహారంలో కొంత మంది నాయకులు అప్పుడే వసూళ్ల పర్వానికి తెరలేపినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తున్నది.

కరీంనగర్, జనవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 4న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అనేక ప్రశ్నలు సంధించారు. రైతు భరోసా ఎందుకివ్వడం లేదు? ఎన్నికల్లో ₹15 వేలు ఇస్తామని చెప్పి కేబినెట్‌లో ₹12 వేలు ఇవ్వడానికి ఎందుకు నిర్ణయం తీసుకున్నరు? ఇది కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసినా ధోఖా కాదా..? వరంగల్ రైతు డిక్లరేషన్ ఎందుకు అమలు చేయలేదో చెప్పాలి? ఒక్క గ్రామంలోనైనా రైతు రుణమాఫీ వందశాతం జరిగిందా..? రైతు భరోసాకు రైతు డిక్లరేషన్ ఎందుకు? వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఫ్రీ బస్సు తప్ప ఏం చేసిన్రు? ఇలా ప్రశ్నల వర్షం కురిపించారు. సిరిసిల్ల కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. కేటీఆర్ సంధించిన ఏ ఒక్క ప్రశ్నకూ సూటిగా సమాధానం చెప్పకపోగా.. ఆరోపణలు, అసత్యపు మాటలతో ఎలా పక్కదారి పట్టించారో స్పష్టమవుతున్నది. మచ్చుకు కొన్నింటిని చూస్తే.. అధికారయంత్రాగం వారికి అనుకూలంగా ఎలా పనిచేస్తుందో అర్థమవుతుంది.

## ఎన్నెన్నో సందేహాలు

సిరిసిల్ల నియోజకవర్గంలో జంగ్ భూములు, సిపాయి భూములు, పోరంబోకు, పంచరాయి, శిఖం, లావుని పట్టా, దేవాలయ, ప్రభుత్వానికి చెందిన వేయి ఎకరాల భూములను బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేశారని కొత్త విమర్శను ఆది శ్రీనివాస్ తెరపైకి తెచ్చారు. అక్కడితో ఆగకుండా ఇప్పటికే ప్రభుత్వం అందులో పావలా వంతు అంటే 250 ఎకరాలు స్వాధీనం చేసుకున్నదని తెలిపారు. అయితే, ఈ మాటలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి వేయి ఎకరాలు కబ్జాకు గురైనట్టు సమాచారం వస్తే ఆ జాబితాను ఎందుకు బయటపెట్టడం లేదు? సదరు వ్యక్తులందరికీ నోటీసులు ఎందుకివ్వలేదు? అంటే దీని వెనుక నడుస్తున్న వ్యవహారం ఏమిటి?. అసలు వేయి ఎకరాల జాబితాను ముందుగానే విప్‌కు ఎవరిచ్చారు? అందులో కాంగ్రెస్ నాయకులను మినహాయించడం కోసం వివరాలు బయటకు వెల్లడించడం లేదా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అలాగే, 250 ఎకరాలు స్వాధీనం చేసుకుంటే.. ఎవరెవరి నుంచి ఎంత భూమి తిరిగి స్వాధీనం చేసుకున్నారో నేటి వరకు ఎందుకు వెల్లడించలేదు. ఇప్పటివరకు కేవలం మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ తనకు కేటాయించిన రెండెకరాల అసైన్డ్ భూమిని అప్పగించినట్టు మాత్రమే అధికారులు వెల్లడించినా.. మరి స్వాధీనం చేసుకున్న మిగిలిన వారి జాబితా ఎందుకు బయట పెట్టడం లేదు? అంతేకాదు, అధికారులు జాబితా బయట పెట్టకుండానే కాంగ్రెస్ నాయకుల చేతికి ఎలా వచ్చింది? కేవలం కొంత మంది బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినా.. 250 ఎకరాలు స్వాధీనం చేసుకొని ఉంటే వారందరిపై తహసీల్దార్లు ఫిర్యాదు చేశారా..? ఇలా ఎన్నో సందేహాలు వస్తున్నాయి. వీటన్నింటిపైనా స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రస్తుతం అధికారయంత్రాగంపై ఉన్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## రైతు భరోసాపై దాటవేతే!

అర్హులకు రైతు భరోసా ఇస్తున్నామంటూ ఆది శ్రీనివాస్ దాటవేసేందుకు తంటాలు పడ్డారు. నిజంగా వరంగల్ రైతు డిక్లరేషన్‌లో చెప్పినట్టు రైతు భరోసా కింద ఎకరాకు ₹15 వేలు ఎందుకివ్వడం లేదో చెప్పలేదు. ప్రస్తుతం ₹12 వేలకు ఎందుకు తగ్గించారో వివరించలేదు. రైతులకు జరిగిన మోసంపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ప్రధానంగా ఒక్క గ్రామంలోనైనా వందశాతం రైతు రుణమాఫీ జరిగిందా..? నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరినా నోరు మెదపలేదు. నిజంగా ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వం మీద అంత నమ్మకముంటే.. కనీసం తాను ప్రాతినిధ్యం వహించే వేములవాడ నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ జరిగిందని చెప్పవచ్చు! కానీ, అలా చెప్పలేదు. పైగా ఈ విషయం గురించి మాట్లాడకుండా మళ్లీ పాత పాటే అందుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిందంటూ చెప్పుకొచ్చారే తప్ప ఏ ఒక్క ప్రశ్నకూ సూటిగా సమాధానం ఇవ్వలేకపోయారు. చాలా విషయాలను అలాగే దాటవేస్తూ కేవలం భూకబ్జాలను తెరపైకి తెచ్చి, అసలు విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నాలు చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

## దళారుల రంగప్రవేశం?

భూముల కబ్జా జరిగిదంటూ ప్రచారం చేయడమే కాకుండా.. అసైన్డ్ భూములున్నాయంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆర్భాటపు ప్రచారాన్ని 'క్యాష్' చేసుకునేందుకు కొంత మంది నాయకులు, దళారులు రంగ ప్రవేశం చేసినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం అందుతున్నది. అంతేకాదు, అధికారుల వద్ద ఉండాల్సిన ఒకటి రెండు జాబితాలు.. కొంతమంది నాయకుల చేతికి వెళ్లినట్టు తెలుస్తున్నది. వీటి ఆధారంగా దళారులు నేరుగా ఇండ్లకు వెళ్లి కొంత మందితో బేరసారాలకు దిగుతున్నట్టు తెలుస్తున్నది. కబ్జా జరిగిన వివరాలుంటే అధికారుల వద్ద ఉండాలే తప్ప దళారుల చేతికి ఎలా వెళ్లాయన్న దానిపై ఇటు అధికారులు, అటు కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాల్సిన అవసరముందన్న డిమాండ్ వ్యక్తమవుతున్నది.

## విప్ గారూ.. వీటిపై ఏదీ స్పష్టత?

➡ రాజన్న కోడెలు కోతకు వెళ్లిన విషయాన్ని అధికారులే ధ్రువీకరించారు. దీనిపై నేటి వరకు ఆది శ్రీనివాస్ స్పందించలేదు. అంతేకాదు, గోశాల నుంచి పంపిణీ చేసిన 1,975 కోడెల వివరాలను తెప్పించేందుకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఆయన చెప్పిన గడువు ముగిసింది. అయితే, నేటి వరకు ఆ వివరాలు వచ్చాయా..? వస్తే ఎన్ని బతికున్నాయి? కోతకు పోయిన కోడెలెన్ని? అన్న వివరాలను ఎందుకు బయటకు చెప్పడం లేదన్న దానిపై నేటికీ స్పష్టత లేదు.

♦ నిజానికి రాజన్న కోడెల విషయంలో పూర్తి వివరాలను ఆరా తీసేందుకు వేములవాడ పోలీసులకు ఫైల్ అప్పగిస్తామని ఆలయ ఈవో ముందుగా చెప్పారు. కానీ, ఆ తర్వాత మాట మార్చి వివరాల సేకరణ దేవాలయ అధికారులకు అప్పగించారు. నిజానికి పోలీసులకు వివరాలు అప్పగించి ఉంటే వాస్తవాలు బయటకు వచ్చేవి. పోలీసులు విచారణ చేయకుండా అడ్డుకున్నదెవరు? ఈవో పోలీసులకు వివరాలు ఇవ్వకుండా ఎందుకు వెనక్కితగ్గారు? అందులో ఎవరి పాత్ర ఉందన్న విషయంపై ఆది శ్రీనివాస్ స్పందించాలన్న డిమాండ్లు వచ్చినా నేటి వరకూ వాస్తవాలు వెల్లడించలేదు.

♦ ముఖ్యమంత్రి వేములవాడ పర్యటన సందర్భంగా ఒక్కో వీఐపీకి ₹32 వేల భోజనం పెట్టినట్టు విమర్శలు, కథనాలు వచ్చాయి. దీనిపై నేటివరకు ఎవరూ స్పందించలేదు. ప్లేట్ భోజనానికి ₹32వేలు అవుతుంది నిజమా.. కాదా? అన్న వివరణ కూడా ఇవ్వలేదు.

⌗ ముంపు గ్రామాల పరిహారం కోసం స్వయంగా కాంగ్రెస్ నాయకులే కొదురుపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూర్చొని దరఖాస్తులు స్వీకరించారు. ఆధారాలతో సహా కథనాలు వచ్చాయి. అంతేకాదు, ఏకంగా ఆది శ్రీనివాస్ పేరిట సదరు దరఖాస్తులు ముద్రించారు. నిజంగా విప్ ఆదేశాల మేరకే పార్టీ నాయకులు దరఖాస్తులు స్వీకరించారా..? లేక వారంతటం వారే తీసుకున్నారా..? వివరణ ఇవ్వలేదు. అలాగే, పార్టీ నాయకులు గ్రామ పంచాయతీలో కూర్చొని నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తులు స్వీకరిస్తే కనీసం విచారణకు ఆదేశించక పోవడం వెనుక ఆంతర్యం ఏమిటన్నదానిపై విమర్శలు వస్తున్నాయి.

⌗ మధ్యమానేరు రిజర్వాయర్‌లో మొత్తం 10,683 నిర్వాసిత కుటుంబాలుండగా.. 4,696 మందికి ₹5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. మిగిలిన 5,987 మంది పరిస్థితి ఏమిటన్న దానిపై నేటికీ మౌనమే రాజ్యమేలుతున్నది. అలాగే, 4,696 మందికి ఇచ్చే డబ్బులు ఒకేసారి ఇస్తారా..? లేక దశల వారీగా ఇస్తారా..? అన్నదానిపై స్పష్టత లేదు.

✓ వేములవాడ అభివృద్ధి కోసం ₹వేయి కోట్లు ఇచ్చారంటూ ముఖ్యమంత్రి సభా వేదికపైనే ఆది శ్రీనివాస్ చెప్పారు. ఆ వేయి కోట్ల లెక్కలు చెప్పాలని ప్రజల నుంచి చాలా సార్లు డిమాండ్ వచ్చింది. కానీ, నేటి వరకు వివరాలు వెల్లడించిన దాఖలాలు లేవు. ఆ పనులన్నీ ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్న దానిపైనా నేటికీ స్పష్టత లేదు.

## రుణమాఫీ చేయలేదు.. రుణం కింద వడ్ల పైసలు ఆగవట్టిన్రు



కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 6 : రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రైతులందరికీ రుణమాఫీ చేయకపోవడంతో.. రెక్కల కష్టాన్ని కూడా కోల్పోయే దుస్థితి వచ్చింది. అందుకు చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన రైతు చాతర్ల మల్లయ్య గోసే అద్దం పడుతున్నది. ఆయన మాటల్లోనే.. 'సర్ నేను 2021 మే 27న మా ఊరిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పంట పెట్టుబడి కోసం ₹85వేలు అప్పుగా తీసుకున్న. ఏటా వడ్డీ కడుతున్న. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన తర్వాత నాకు రుణమాఫీ కాలేదు. అధికారులు, బ్యాంకోళ్ల చుట్టూ తిరిగీ తిరిగి యాష్టకొచ్చింది. 2023 డిసెంబర్‌లో నేను వడ్లు అమ్మితే ₹77545 అచ్చినయి. అవి నా బ్యాంకు ఖాతాలో పడ్డయి. కానీ, వెంటనే (అదే నెల 9న) బ్యాంకోళ్లు రుణం చెల్లింపు కింద ఆపిన్రు' అని ఆవేదన చెందాడు. ఏడాది సంది నేను కలెక్టర్, అగ్రికల్చర్ సార్లను, ఇతర సార్లను కూడా కలిసినా ఇప్పటివరకు న్యాయం జరగలేదని వాపోయాడు. ఇప్పుడు మళ్లీ వచ్చి ప్రజావాణిలో దరఖాస్తు చేశానని, ఇప్పటికైనా తన పైసలు తనకు ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

# కాంగ్రెస్ మోసంపై ఆగ్రహజ్వాల



కరీంనగర్: నిరసనలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, మేయర్ సునీల్‌రావు, నాయకులు

- రైతుభరోసా తగ్గింపుపై మండిపడ్డ బీఆర్ఎస్
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- రాస్తారోకోలు, ధర్నాలతో దద్దరిల్లిన రోడ్లు
- 'రైతు ద్రోహి రేవంత్‌రెడ్డి' అంటూ నినాదాలు
- ఇచ్చిన హామీ మేరకు ₹15 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్
- ఇచ్చేదాకా తగ్గేది లేదని హెచ్చరిక






పెద్దపల్లి: అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

పెద్దపల్లి, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతు భరోసా కింద ఎకరానికి ఏటా ₹15 వేలు ఇస్తామని చెప్పి వంచించిన కాంగ్రెస్ సర్కారు బీఆర్ఎస్ భగ్గుమన్నది. ఇప్పుడు ఎకరానికి ₹12 వేలే ఇస్తామంటూ రైతులను మోసం చేసిందని మండిపడింది. ఇచ్చిన హామీని అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలతో హోరెత్తిచ్చింది. అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించి నిరసన తెలిపింది. రైతులకు ఇచ్చిన హామీలు అమలయ్యేదాకా పోరాడుతామని స్పష్టం చేసింది. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో పెద్ద ఎత్తున ధర్నా చేయగా, నగర మేయర్ వై సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుపడు జీవీ రామకృష్ణారావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, నగర పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు. సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లో తహసీల్దార్లకు వినతి పత్రాలు అందించారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో అంబేద్కర్ చౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చంద్రపేట చౌరస్తాలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యాక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్‌డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, నాయకులు గూడూరి ప్రవీణ్, ఎండీ సత్తార్, కౌన్సిలర్లు రాస్తారోకో చేశారు. తంగళ్లపల్లిలో తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి, తహసీల్దార్‌కు వినతి పత్రంఇచ్చారు. గంభీరావుపేటలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఎల్లారెడ్డిపేటలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వీర్నపల్లి, ముస్తాబాద్, చందుర్తి, కోనరావుపేటలో నిరసనలు చేపట్టారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. మంథని మండలం ఎక్లాస్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రతులను బురదలో తొక్కి నిరసన తెలిపారు. సుల్తానాబాద్‌లో రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు.



సిరిసిల్ల టౌన్: చంద్రంపేట చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ నాయకులు

### నమ్మించి నట్టేట ముంచారు

రేవంత్‌రెడ్డి రైతులను నమ్మించి నట్టేటా ముంచారు. రైతు భరోసా కోసం ఏడాది కాలంగా ఎదురు చూస్తున్న అన్నదాతల ఆశలను ఆవిరి చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు ₹15 వేలు ఇచ్చేదాకా ఊరుకునే ప్రసక్తే లేదు. కొందరికే మాత్రమే ₹2 లక్షల రుణమాఫీ చేసి అందరికీ చేశామని చెప్పు కోవడం సిగ్గు చేటు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుపై నిజమైన ప్రేమ ఉంటే వానకాలం, యాసంగి పంటలకు ఒకేసారి ₹15 వేలు వారి ఖాతాలో జమచేయాలి. అన్ని రకాల వడ్లకు ₹500 బోనస్ ప్రకటించాలి. అరచేతిలో స్వర్గం చూపించి, కానిపోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసలు రంగును ప్రజలు అనతి కాలంలో గుర్తించారు. అవకాశం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారు.

**- పెద్దపల్లిలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి**



మంథని రూరల్: కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాలను బురదలో తొక్కుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, నాయకులు

### రైతులను దగా చేసిన కాంగ్రెస్

రైతులను కాంగ్రెస్ నిలువునా మోసగించింది. అమలు కాని హామీలతో గద్దెనెక్కి, ఆచరణలో విఫలమైంది. రైతుభరోసా కింద ఎకరానికి ₹15 వేలు ఇస్తామని గొప్పలు చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ₹12 వేలనడం సిగ్గుచేటు. రైతులను మోసం చేయడమే కాంగ్రెస్ ఎజెండా. ఇచ్చిన మాట ప్రకారం ఎకరానికి ₹15 వేలు ప్రతి రైతు ఖాతాలో జమ చేయాల్సిందే. లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తాం.

**- హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్**

### పరిపాలన దృష్టి పెట్టాలి

రేవంత్‌రెడ్డి ఢిల్లీకి సంచులు మోసే పనిని పక్కన పెట్టి పరిపాలనపై దృష్టి సారిస్తే బాగుంటుంది. మహారాష్ట్ర ఎన్నికల ప్రచార కార్యక్రమాల పేరుతో పేపర్ల అడ్వర్టైజ్‌మెంట్లకు, హెలీకాప్టర్లలో తిరుగుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఆ డబ్బులతో తెలంగాణ రైతులకు రైతు భరోసా, పెన్షన్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలన్నీ అమలు చేయవచ్చు. మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారు. అందుకు నిలువెత్తు నిదర్శనమే రైతు భరోసా. ఎకరానికి ₹15 వేలతో వస్తేనే ప్రజలు జనవరి 26న శ్రీధర్‌బాబును ఆహ్వానిస్తారు. ₹12 వేలతో వస్తే తగిన గుణపాఠం చెప్తారు.

**- మంథని మండలం ఎక్లాస్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



హుస్నాబాద్ ధర్నాలో నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, నాయకులు



ధర్మపురి: అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# ఉమ్మడి జిల్లా ఓటర్లు 29.99 లక్షలు

- కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 10,83,365 మంది
- తుది జాబితా విడుదల



పెద్దపల్లి, జనవరి 6 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 29.99 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. గతేడాది అక్టోబర్ 29 నుంచి ఓటరు జాబితా సవరణ చేపట్టి, సోమవారం తుది జాబితాను విడుదల చేసింది. కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలోని ఓటర్ల జాబితా సవరించిన తర్వాత నాలుగు నియోజకవర్గాల్లో 10,83,365 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 5,30,337 మంది, 5,52,353 మంది మహిళలు, 61 మంది ట్రాన్స్‌జెండర్స్, 614 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. జగిత్యాల జిల్లాలో 7,20,825 మంది ఓటర్లు ఉండగా, అందులో 3,45,819 మంది పురుషులు, 3,74,712 మంది మహిళలు, 35 మంది ట్రాన్స్‌జెండర్స్, 259 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం ఓటర్లు 7,18,042 మంది ఉండగా, 3,53,732 మంది పురుషులు, 3,63,607 మంది మహిళలు, 51 మంది ట్రాన్స్‌జెండర్స్, 653 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. సిరిసిల్ల జిల్లాలో 4,76,604 మంది ఉండగా, అందులో 2,29,352 మంది పురుషులు, 2,47,046 మంది మహిళలు, 37 మంది ట్రాన్స్‌జెండర్లు, 169 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. మొత్తంగా సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాలను మినహాయిస్తే ఉమ్మడి జిల్లాలో 29,99,006 మంది ఓటర్లు ఉన్నారు. ఇక హుస్నాబాద్ నియోజకవర్గంలో 2,51,150 మంది ఓటర్లు ఉండగా, అందులో 1,23,083 మంది పురుషులు, 1,27,837 మంది మహిళలు, ఆరుగురు ట్రాన్స్‌జెండర్స్, 224 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు.